


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 10, పేజీలు - 08
శనివారం, జులై 4, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# సామాన్యులకు అలర్ట్!

## ఓటు హక్కు కేవలం రాజకీయం కాదు

### - మీ రేషన్, పెన్షన్ పథకాలను శాసించే డిజిటల్ పత్రం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారతదేశంలో ఓటు హక్కు అనేది కేవలం ఐదేళ్లకు ఒకసారి మనకు నచ్చిన నాయకుడిని లేదా రాజకీయ పార్టీని ఎన్నుకునే ఒక ప్రక్రియ మాత్రమే అని చాలా మంది భావిస్తుంటారు. మాకు రాజకీయాలు వద్దు ఓటు వేయకపోయినా పర్లేదు అంటూ ఎన్నికల రోజున సెలవు దినంగా భావించి ఇళ్లకే పరిమితమయ్యే మధ్యతరగతి, సామాన్య వర్గాలు నేడు దేశంలో చాలా ఎక్కువ. అయితే, మారుతున్న సాంకేతిక యుగంలో ఓటు హక్కుపై నిర్లక్ష్యం వీడకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో మీ ఓటర్ ఐడీ కేవలం ఎన్నికల గుర్తింపు కార్డు మాత్రమే కాదు మీ రేషన్ కార్డు, పెన్షన్, రైతు భరోసా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతను శాసించే అత్యంత కీలకమైన పత్రంగా మారబోతోంది.

**పశ్చిమ బెంగాల్ రేషన్ కార్డుల ఏరివేత**

ప్రభుత్వాలు లబ్ధిదారుల వడపోత కోసం డేటాబేస్‌లను ఎలా వాడుతున్నాయో చెప్పడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యలే ఒక నిదర్శనం. అక్కడ అర్హత లేని, బోగస్, నకిలీ రేషన్ కార్డుదారులను ఏరివేసేందుకు ఆ రాష్ట్ర యంత్రాంగం ఎస్ఐఆర్ ఓటర్ డేటాబేస్‌లను ప్రామాణికంగా తీసుకుంటోంది. రేషన్ కార్డులో పేర్లు ఉండి, ఓటర్ జాబితాలో లేని వారిని, లేదా అసలు ఓటు హక్కు లేని వారిని డిజిటల్ వడపోత ద్వారా గుర్తించి లక్షలాది బోగస్ కార్డులను రద్దు చేస్తున్నారు. బెంగాల్‌లో జరిగిన ఈ ఉదంతం దేశవ్యాప్తంగా ఉన్న సామాన్య ఓటర్లకు ఒక పెద్ద కనువిప్పు లాంటిది.

2లో..

# ఎస్ఐఆర్ నిలిపేయండి

### - సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్ల జాబితాల

2లో..

# తెలంగాణలో అప్పుల సవాళ్ల పోరు

### ప్రెస్ క్లబ్‌లో జూపల్లి, లేఖలతో హరీష్ రావు!




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర అప్పుల లెక్కల చుట్టూ సాగుతున్న రాజకీయ రగడ రోజుకో మలుపు తిరుగుతూ హైవోల్టేజ్ వార్‌గా మారింది. గురువారం నాటి ఉత్కంఠ పరిణామాల అనంతరం, శుక్రవారం నాడు మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన తాజా సవాల్‌తో ఈ వివాదం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు చేరింది. సాయంత్రం 5 గంటలకు ప్రెస్ క్లబ్‌కు వస్తున్నా దమ్ముంటే బీఆర్ఎస్ నేతలు చర్చకు రావాలి అని జూపల్లి సవాల్ విసరడమే కాకుండా, అన్నట్లుగానే చెప్పిన సమయానికి లెక్కల చిట్టాతో ప్రెస్ క్లబ్‌కు చేరుకున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఎలా అప్పుల కుప్పగా మార్చారో ప్రజల ముందు బట్టబయలు చేస్తానంటూ ఆయన

2లో..

## రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?

### - కేసీఆర్, హరీశ్రావులకు భట్టి కౌంటర్ ఎటాక్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు

2లో..

# పారిశ్రామిక పెట్టుబడులకు ప్రభుత్వం హామీ

### - కుప్పంలో 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన

- అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం
- శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు
- దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ



**కుప్పం (ప్రశ్న న్యూస్)** "గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, నేడు జరిగిన కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం..

2లో..

# మతిస్థిమితం లేని రాజకీయం చేస్తున్న జగన్

### - రెండేళ్లలో ఉక్కు పరిశ్రమను ప్రారంభిస్తామన్న సీఎం చంద్రబాబు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** గత ప్రభుత్వం కడప స్టీల్ ప్లాంట్ విషయంలో 2019, 2023లో రెండుసార్లు మోసపూరిత శంకుస్థాపనలు చేసి ఒక్క ఇటుక కూడా పేర్చలేదని, కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులకు శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దశాబ్దాల కాలంగా రాయలసీమ ప్రజలు ఎదురుచూస్తున్న ఉక్కు కర్మాగారం కలను తమ ప్రభుత్వం నిజం చేసిందని ఆయన తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ (జేఎస్‌డబ్ల్యూ) రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అనుమానాలను దాటుకుని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించాం. గత పాలకులు 2019, 2023లో రెండుసార్లు ఇక్కడే శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. కానీ ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు

2లో..

## హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్

### బుద్ధుడిని కొత్త కోణంలో చూసే అవకాశం!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ప్రజలకు, పర్యాటక ప్రేమికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగరంలోని హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ కీలక అడుగు వేస్తోంది. ఇప్పటికే బోటింగ్ సౌకర్యంతో సందర్శకులను ఆకట్టుకుంటున్న హుస్సేన్‌సాగర్‌కు మరింత ప్రత్యేక ఆకర్షణను జోడిస్తూ సరస్సు చుట్టూ ఆధునిక సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ స్కైవాక్ ద్వారా సందర్శకులు హుస్సేన్‌సాగర్ మధ్యలోని ప్రపంచ ప్రసిద్ధ ఏకశిల బుద్ధ విగ్రహాన్ని సరికొత్త కోణంలో వీక్షించే అవకాశం పొందనున్నారు. సాయంత్ర వేళల్లో సరస్సు అందాలు, నగర వెలుగులు, బుద్ధ విగ్రహం ఒకే వేదికపై కనిపించేలా ఈ ప్రాజెక్టును రూపొందించనున్నట్లు సమాచారం. దీంతో హైదరాబాద్ టూరిజానికి మరో

2లో..

# వేలంలో విమానాన్ని విక్రయించిన ఈడీ

### - రూ.3 కోట్లు పలికిన హాకర్ 800ఏ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తాము స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించి చరిత్ర సృష్టించారు. హైదరాబాద్ జోనల్ ఈడీ ఆధ్వర్యంలో హాకర్ 800ఏ ప్రైవేట్ జెట్‌ను ఎంఎస్‌టీసీ ద్వారా జూలై 1వ తేదీన ఈ-వేలంలో విక్రయించారు. ఈ వేలంలో హాకర్ 800ఏ విమానం రూ.3 కోట్లకు అమ్ముడుపోయినట్లు ఈడీ అధికారులు స్పష్టం చేశారు. ఈ రూ.3 కోట్లను బాధితులకు తిరిగి చెల్లించేందుకు ఈడీ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసిన ఈడీ.. దర్యాప్తు

2లో..

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

### - ఫలప్రదమైన చర్చ జరిగిందన్న పవన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. శుక్రవారం సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు.

2లో..

# బెదిరింపులతో ఏమీ మార్చలేరు

### - సింధు జలాల ఒప్పందంపై వెనక్కి తగ్గేది లేదు
### - పాకిస్థాన్‌కు భారత్ స్పష్టం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సింధు జలాల ఒప్పందంపై భారత్ తన వైఖరిని మరోసారి సుస్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ విశ్వసనీయంగా, శాశ్వతంగా అడ్డుకట్ట వేసే వరకు 1960 నాటి ఈ ఒప్పందం నిలిపివేత దిశగానే ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ వ్యవహారంలో పాకిస్థాన్ చేస్తున్న విమర్శలను, హెచ్చరికలను

2లో..

# సామాన్యులకు అలర్ట్!

## ఒకే గొడుగు కిందికి పౌరుల సమాచారం!

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే కుటుంబానికి సంబంధించిన అన్ని రకాల అధికారిక డేటాబేస్‌లను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చే డిజిటల్ విప్లవానికి తెరలేపాయి. ఇప్పటికే ఆదాయపు పన్ను శాఖకు సంబంధించిన పాన్ కార్డును ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలతో అనుసంధానం చేసిన తరహాలోనే, ఇప్పుడు ఓటర్ ఐడీని కూడా ఇతర ముఖ్యమైన డేటాబేస్‌లతో అనుసంధానించే ప్రక్రియ వేగంగా సాగుతోంది. దీనివల్ల ఒక పౌరుడి ఆర్థిక స్థితిగతులు, కుటుంబ వివరాలు, ప్రభుత్వ పథకాల లబ్ధి అంతా ఒకే క్లిక్‌తో అధికారుల స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. ఈ వ్యవస్థలో ఓటర్ ఐడీ అనేది ఒక కీలకమైన యాంకర్ డేటా గా మారబోతోంది.

## ఓటు లేకపోతే సంక్షేమానికి ఎసరు!

ఒక కుటుంబంలో అర్హులైన వయసు ఉన్న పౌరులు ఉండి కూడా, ఓటర్ లిస్టులో వారి పేర్లు నమోదు కాకపోతే అది ప్రభుత్వ డిజిటల్ సిస్టమ్‌లో ఆ కుటుంబానికి సంబంధించిన సామాజిక-ఆర్థిక స్థితిగతులలో తీవ్ర వ్యత్యాసాలను చూపిస్తుంది. భవిష్యత్తులో సంక్షేమ పథకాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు ఏదైనా ఒక కఠినమైన నిబంధనను తీసుకువస్తే అందులో ఓటర్ ఐడీ చురుగ్గా లేకపోవడం లేదా ఓటర్ లిస్టులో పేరు లేకపోవడం అనేది మీ సంక్షేమ పథకాల తిరస్కరణకు ఒక బలమైన సాంకేతిక కారణం కావచ్చు. ఒక రకంగా చెప్పాలంటే, ఓటు లేని పౌరుడిని సిస్టమ్ యాక్టివ్ సిటిజన్ గా గుర్తించని పరిస్థితి త్వరలోనే రానుంది. ప్రభుత్వం నుండి ఎలాంటి సబ్సిడీలు, రాయితీలు, లేదా లబ్ధి పొందాలన్నా ఓటర్ లిస్టులో మీ పేరు సజీవంగా ఉండటం ప్రాథమిక అవసరంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం అనేది కేవలం హక్కు మాత్రమే కాదు డిజిటల్ ఇండియాలో మీ కుటుంబ సంక్షేమానికి అదొక రక్షణ కవచం అని గ్రహించాలి.

## ఓటర్ జాబితాను తనిఖీ చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత!

పశ్చిమ బెంగాల్ రేషన్ కార్డుల వ్యవహారం భవిష్యత్తు ప్రభుత్వాల పనితీరుకు ఒక ముందస్తు సంకేతం. అందుకే సామాన్య ప్రజలు ఓటు హక్కుపై నిర్లక్ష్యం వీడాలి. ఎస్ఐఆర్ కార్యక్రమాల్లో పాల్గొని, తమ పేర్లు ఓటర్ లిస్టులో ఉన్నాయో లేదో సరిచూసుకోవడం, చిరునామాలు మారితే వెంటనే అప్‌డేట్ చేసుకోవడం అత్యంత శ్రేయస్కరం.

# ఎస్ఐఆర్ నిలిపేయండి

నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్‌క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

# పారిశ్రామిక పెట్టుబడులకు ప్రభుత్వం హామీ

పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

### పెట్టుబడుల కుంభవృష్టి.. ఉద్యోగాల జాతర

ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీరనున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది.
దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏవియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది. వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

### శంకుస్థాపన రోజే ప్రారంభ తేదీలు

ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు.

### కుప్పం నా బాధ్యత.. అభివృద్ధి నా ఆశయం

ఈ సభలో ప్రసంగించిన చంద్రబాబు, కుప్పం ప్రజలు తనను 8వ సారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి దీవెనలే తనకు శ్రీరామరక్ష అని అన్నారు. "నేను ఎక్కడున్నా నా ఆలోచనలు కుప్పం మీదే ఉంటాయి. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేయాలన్నది నా కోరిక. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి, అందులో కుప్పం ముందుండాలి," అని ఆయన ఆకాంక్షించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను అందించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారి తోకలు కత్తిరిస్తానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో పరిశ్రమలతో పాటు, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, బీసీ, ఓసీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు, పరిశ్రమల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్లు, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ వంటి పలు అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?

తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ?

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

# తెలంగాణలో అప్పుల సవాళ్ల పోరు

మీడియా వేదికగా గులాబీ శ్రేణులపై విరుచుకుపడ్డారు.చెప్పినట్లుగానే ఐదు గంటలకు ప్రెస్‌క్లబ్ చేరుకున్న జూపల్లి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్ల భారీ అప్పుపై మాజీ ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్ రావు కనీస క్లారిటీ ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు నిజంగా పౌరుషం ఉంటే తాము చేసిన తప్పులను ఒప్పుకుని, రాజకీయ రాజీనామాలకు సిద్ధమవ్వాలని డిమాండ్ చేశారు. మాట తప్పడం మా ఇంట వంట లేదు. కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో వేల కోట్లు అప్పు తెచ్చింది నిజం కాదా ఆ అప్పులను ఎలా తీరుస్తారో చెప్పమంటే సమాధానం లేదు. హరీష్ రావు రాసిన లేఖలో కేవలం సొల్లు, మాటల గారడీ తప్ప మరేమీ లేదు అని జూపల్లి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.మంత్రి జూపల్లి ప్రెస్ క్లబ్‌లో ఉన్న సమయంలోనే బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు పక్కా ఆధారాలతో కూడిన ఒక సుదీర్ఘమైన కౌంటర్ లేఖను విడుదల చేసి కాంగ్రెస్ నరేటివ్‌ను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. మంత్రి జూపల్లికి పంపిన లేఖలో హరీష్ రావు సంచలన అంశాలను ప్రస్తావించారు. తొమ్మిదిన్నరేళ్ల మా పాలనలో రాష్ట్ర అప్పు రూ.4,17,000 కోట్లు మాత్రమేనని ప్రకటించాను, ఇప్పటికీ ఆ మాటకే కట్టుబడి ఉన్నాను. ఎక్కడైనా, ఎప్పుడైనా దీనిపై చర్చకు సిద్ధం అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతోందని విమర్శించారు. మార్చి నెలలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ కాంగ్రెస్ అప్పు రూ.3,47,294 కోట్లు అని చెబితే, జూపల్లి రాసిన లేఖలో మాత్రం కేవలం రూ.1,77,058 కోట్లు అని తక్కువ చేసి చూపించడాన్ని హరీష్ రావు నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే వివిధ మార్గాల ద్వారా దాదాపు రూ.4,50,000 కోట్ల కొత్త అప్పులు చేసిందని ఆరోపించారు. ఈ రాజకీయ సవాళ్ల పర్వంలో ఇరు పార్టీలు సామాన్య ప్రజలను సైతం కన్ఫ్యూజ్ చేసేలా లెక్కల యుద్ధానికి తెరలేపాయి. గతంలో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన వీడియో క్లిప్పింగ్స్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన అధికారిక నివేదికలను హరీష్ రావు తన లేఖకు జత చేసి జూపల్లికి పంపించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకుని వాస్తవాలు తెలుసుకోవాలని హరీష్ రావు హితవు పలికారు. మొత్తానికి, ఒకవైపు మంత్రి జూపల్లి ప్రెస్ క్లబ్ వేదికగా లైవ్ డిబేట్‌కు కూర్చోవడం, మరోవైపు హరీష్ రావు డాక్యుమెంట్లతో కూడిన లేఖల అస్త్రాలు సంధించడంతో ఈ అప్పుల రాజకీయం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు.

# హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్

కొత్త గుర్తింపు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఇదే సమయంలో నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని కూడా అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అక్కడ అంతర్జాతీయ బుద్ధ మ్యూజియం, హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. బుద్ధుడి జీవిత ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు, మహాస్థూపం, ఇతర ఆకర్షణలను మరింత విస్తరించి పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం 274 ఎకరాల్లో విస్తరించిన బుద్ధవనాన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. అంతేకాకుండా ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో భారీ మట్టి బౌద్ధ స్తూపం నిర్మించేందుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. అలాగే ఫణిగిరి, బుద్ధవనం, నేలకొండపల్లి, హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహాన్ని కలుపుతూ ప్రత్యేక బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీకెండ్ టూరిజాన్ని ప్రోత్సహించేలా ఒక రోజు, రెండు రోజుల ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దేశీయ పర్యాటకులతో పాటు విదేశాల నుంచి వచ్చే బౌద్ధ యాత్రికులను ఆకర్షించేలా ప్రత్యేక బౌద్ధ, జైన టూరిజం సర్క్యూట్లను రూపొందించనుంది. ఈ ప్రాజెక్టులు అమలైతే రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# వేలంలో విమానాన్ని విక్రయించిన ఈడీ

కొనసాగుతోందని తెలిపింది.ఈ హాకర్ 800ఏ విమానం హైదరాబాద్‌కు చెందిన క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, ఫాల్కన్ గ్రూప్ ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినదని ఈడీ తెలిపింది. నకిలీ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో భారీ పెట్టుబడులను సేకరించి సుమారు రూ.792 కోట్ల మేర పోంజీ మోసానికి అమర్‌దీప్ కుమార్ పాల్పడిన వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో భాగంగా గతేడాది మార్చి 7వ తేదీన శంషాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఉన్న ఈ ప్రైవేట్ జెట్‌ను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఈ విమానాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత ఈడీ అధికారులు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద అడ్జుడికేటింగ్ అథారిటీని ఆశ్రయించింది. ఆస్తి స్వాధీనాన్ని అథారిటీ ధ్రువీకరించగా ఆ తర్వాత విమానాన్ని వేలం వేయడానికి అనుమతి లభించింది. దీంతో ఎంఎస్‌టీసీ వేదికగా ఈ-వేలం నిర్వహించిన ఈడీ అధికారులు దాన్ని విజయవంతంగా విక్రయించారు.ఈ విమానం వేలం ద్వారా వచ్చిన రూ.3 కోట్ల మొత్తాన్ని చట్టపరమైన ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు అనుమతితో నిజమైన బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. మోసాల ద్వారా సంపాదించిన ఆస్తులను విక్రయించి బాధితులకు పరిహారం అందించడంలో ఇది దేశంలోనే తొలి సంఘటనగా నిలిచింది.ఇప్పటికే ఈ పెట్టుబడుల మోసం కేసులో అమర్‌దీప్ కుమార్ సోదరుడు సందీప్ కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ శరద్ చంద్ర తోష్నివాల్, ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ సీఈవో ఆర్యన్ సింగ్ ఛాబ్రా సహా పలువురు నిందితులను ఈడీ అరెస్ట్ చేసింది. గతేడాది సెప్టెంబర్‌లో సంబంధిత కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లైంట్ కూడా దాఖలు చేసింది. నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించడం వాటిని సీజ్ చేయడం వాటిని వేలం వేసి బాధితులకు పరిహారం చెల్లించడం వంటి చర్యలను చట్టబద్ధంగా చేస్తామని ఈడీ స్పష్టం చేసింది.

# మతిస్థిమితం లేని రాజకీయం చేస్తున్న జగన్




పడలేదు. మేం అధికారంలోకి రాగానే పనులు మొదలుపెట్టి మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం" అని వ్యాఖ్యానించారు.

### రూ.16 వేల కోట్లకు పైగా పెట్టుబడి.. వేల ఉద్యోగాలు

రెండు దశల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడితో, ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ స్టీల్ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. దీనికి అనుబంధంగా రూ.20,350 కోట్ల వ్యయంతో 3,850 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టును కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సీఎం వివరించారు. ఈ ప్లాంట్‌ను పూర్తిగా గ్రీన్ ఎనర్జీతోనే నడుపుతారని తెలిపారు. ఇదే వేదిక నుంచి విజయనగరం జిల్లాలో రూ.531 కోట్లతో 1,166 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కును కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.

### కియా అభివృద్ధికి, బ్రాహ్మణి స్టీల్స్ అవినీతికి నిదర్శనం

గత ప్రభుత్వాల పనితీరును, తమ పాలనను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పోల్చి చూపారు. మేం రాష్ట్రాభివృద్ధికి కియా మోటార్స్ వంటి పరిశ్రమను తీసుకొస్తే, మరొకరు బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో సహజ వనరులను దోచుకున్నారని, ఈ రెండే అభివృద్ధికి, అవినీతికి నిదర్శనాలని అన్నారు. "దేశవ్యాప్తంగా పోటీ ఉన్నా 2017లో అనంతపురానికి కియా పరిశ్రమను తెచ్చాం. నేడు ఆ పరిశ్రమ 19 లక్షల కార్లను ఉత్పత్తి చేసి, 90 దేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనం. కానీ, 2007లో బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో 14 వేల ఎకరాలు తీసుకుని, ఓబుళాపురం గనుల నుంచి ఇనుప ఖనిజాన్ని విదేశాలకు స్మగ్లింగ్ చేశారు. ప్లాంట్ పెట్టలేదు, ప్రజలను మోసం చేశారు. తప్పు చేసిన వాళ్లు జైలుకు వెళ్లారు. ఎవరిది విశ్వసనీయతో, ఎవరు మోసగాళ్లో ఈ ఒక్క ఉదాహరణతోనే ప్రజలకు అర్థమవుతుంది" అని చంద్రబాబు అన్నారు.

### రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

జేఎస్‌డబ్ల్యూ బళ్లారి ప్లాంట్ కంటే అధిక సామర్థ్యంతో రాయలసీమ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలని సజ్జన్ జిందాల్‌ను కోరినట్లు సీఎం తెలిపారు. ప్లాంట్ అవసరాల కోసం గండికోట నుంచి 2 టీఎంసీల నీటిని పైప్‌లైన్ ద్వారా అందిస్తామని, అత్యంత నాణ్యమైన స్థానిక ఇనుప ఖనిజాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనకాపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని, జేఎస్‌డబ్ల్యూ, విశాఖ స్టీల్‌తో కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఉక్కు రాష్ట్రంగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాయలసీమ ఇక కరవు నేల కాదని, హార్టికల్చర్, పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. ఆగస్టు 15న మదనపల్లిలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని, అమెరికాలోని గ్రాండ్ కాన్యన్‌కు ధీటుగా గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణకే తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

# బెదిరింపులతో ఏమీ మార్చలేరు

భారత విదేశాంగ శాఖ తీవ్రంగా తోసిపుచ్చింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో సింధు జలాల ఒప్పందంపై పాకిస్థాన్ అంతర్జాతీయ సదస్సు నిర్వహించి, భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఒప్పందం ఇప్పటికీ అమలులోనే ఉందని, నీటిని ఆయుధంగా మార్చవద్దంటూ పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ సహా ఇతర మంత్రులు చేసిన హెచ్చరికలను ఆయన తిప్పికొట్టారు. తన అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే పాకిస్థాన్ ఇలాంటి నిరాధార వ్యాఖ్యలు చేస్తోందని ఆయన విమర్శించారు.2025 ఏప్రిల్‌లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటన అనంతరం, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదానికి నిరసనగా భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేసింది. ఒప్పందానికి ప్రతిపాదిక అయిన స్నేహపూర్వక వాతావరణాన్ని, సద్భావన సూత్రాలను పాకిస్థాన్ నిరంతరం ఉల్లంఘిస్తోందని భారత్ ఆరోపిస్తోంది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం తూర్పు నదులైన రావి, బియాస్, సట్లేజ్‌లపై భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు ప్రధాన హక్కులు లభించాయి. ప్రస్తుతం నదీ జలాల ప్రవాహంలో ఎలాంటి మార్పులు లేనప్పటికీ, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ వివాదంపై అంతర్జాతీయ స్థాయిలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాకిస్థాన్ హెచ్చరిస్తోంది.

## ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కట్టు దిట్టంగా
# అమలు చేయాలి

**గోదావరిఖని:** పెద్దపెల్లిజిల్లాలోని గోదావరిఖనిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు.తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు.జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన లో పేర్కొన్నారు.

# గ్రామాలవారీగా సి ఏం రిలీఫ్ ఫండ్ పంపిణీ



**కొడిమ్యాల,** కొడిమ్యాల మండలం లోని సూరం పేట, కొడిమ్యాల నాచుపల్లి గ్రామాల వారిగా కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి చేతుల మీదుగా సి ఏం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రసహకార బ్యాంక్ డైరెక్టర్ గుడి మల్లి కార్జునరెడ్డి, మాజీ జెడ్పి టీసి చిలువేరి నారాయణగౌడ్, ముమ్మాడీ స్వామి పాల్గొన్నారు.

# బదిపల్లిలో సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమం



**కొత్తపల్లి** బదిపల్లి గ్రామంలో నిర్వహించిన సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓతో కలిసి కాంగ్రెస్ నాయకులు కోడూరు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని గణేష్, మండల ప్రధాన కార్యదర్శి మునిగల శ్రీనివాస్, గ్రామ ఉపాధ్యక్షుడు తాంద్ర సంజీవ్, గ్రామ ప్రధాన కార్యదర్శి తాంద్ర రాజకుమార్, ఐదో వార్డు సభ్యుడు గర్రెపల్లి వెంకటేష్, కారోబారి వెంగళం వాసరయ్య పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు గ్రామ ప్రజలు సహకరించారు.

## ప్రతి ఓటర్ నుండి కచ్చితంగా
# సమాచారాన్ని సేకరించాలి!
## - ఆర్డీవో కిడారి సందీప్ కుమార్



**సి.బెళగల్** మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామంలో కర్నూల్ ఆర్డీవో కిడారి సందీప్ కుమార్ పర్యటించారు. ఈ పర్యటనలో గ్రామంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించి బిఎల్వోలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఓటర్ నుండి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో గల ప్రభుత్వ చౌకధర దుకాణాలను తనిఖీ చేసి,పలు రికార్డులను, కొలతలను, దుకాణాల్లో ఉన్న నిలువలను పరిశీలించారు. ప్రజలకు రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసిల్దార్ వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ శ్యామలమ్మ, వీఆర్వో శ్రీనివాసులు, బిఎల్వోలు వెంకటేశ్వరమ్మ, ఆరోని తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో కొత్త ఆశలు

- లక్ష్మి పూర్ గ్రామంలో పేదోడికి పండుగ రోజు.
- దర్వాజాతో సొంతింటి కల నెరవేరింది.
- కాంగ్రెస్ పాలనలో పేదవాడి జీవితంలో వెలుగులు.





**మంథని( ప్రశ్న న్యూస్)** మంథని మండలం లక్ష్మిపూర్ గ్రామంలో శుక్రవారం రోజున పేద కుటుంబానికి సొంత ఇంటి కల సాకారమైంది. గ్రామానికి చెందిన బందెల కవిత రామ్ చందర్ కుటుంబ సభ్యులు తమ సొంత ఇంటి నిర్మాణానికి ఘనంగా భూమి పూజ చేసి దర్వాజ పెట్టినారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ప్రత్యేక చొరవతో ఈ కుటుంబానికి న్యాయం జరిగింది. అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను నిజం చేయాలనే సంకల్పంతో వారు నిరంతరం కృషి చేస్తున్నారు. శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలో సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలు పేదల గడప దాకా చేరాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో లక్ష్మిపూర్ గ్రామంలో పేద కుటుంబానికి ఇంటి నిర్మాణానికి అనుమతులు లభించడం గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.“ కాంగ్రెస్ ప్రభుత్వ దయతో మా కల నిజమైంది. ఈ సహాయానికి మేము జీవితాంతం రుణపడి ఉంటాం” అని లబ్ధిదారులు భావోద్వేగంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ చెరుకు తోట సురేష్ పొనగంటి రమేష్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పేదవాడి పక్షాన కాంగ్రెస్ ప్రతి ఇంటికి ఆశ, ప్రతి జీవితానికి భరోసా!

## కృష్ణలంక పీఎస్ టెర్రస్పై ఎముకలు, బూడిద

విజయవాడ గాదె సాయికృష్ణ కేసులో వెలుగులోకి సంచలన విషయాలు బయటపడ్డాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో అనుమానాస్పద మరకలను సిట్ అధికారులు గుర్తించారు. కృష్ణలంక పీఎస్ టెర్రస్పై ఎముకలు, బూడిద గుర్తించారు. కాలిన హ్యాండ్ గొలుసు, లాఠీ సీజ్ చేసారు. కస్టడీలో తీవ్రగాయాలతో సాయికృష్ణ మరణించినట్లు సిట్ గుర్తించింది.

## ప్రజల సమస్యలు మా దృష్టికి తీసుకురండి తీరుస్తాం

### ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి తాసిల్దార్ విజయ్ కుమార్

పోరుమామిళ్ల పోరుమామిళ్ల మండలంలోని శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొని మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అన్ని శాఖల అధికారులు వివరించడం జరిగింది ఇందులో భాగంగా ఎమ్మార్వో విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ లో భాగంగా ప్రతి సచివాలయంలో ఒక హెల్ప్ లైన్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలని తెచ్చిన వాటిని వెంటనే పరిష్కరిస్తామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు అంతేకాకుండా పోరుమామిళ్ల మండలంలోని రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉన్న మా దృష్టికి తేవాలని ఆయన తెలిపారు ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి మండలానికి మంచి పేరు తేవాలని ప్రజలు కూడా అన్ని శాఖల అధికారులకు సహకరించాలని వారు తెలిపారు జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్ మరియు వైస్ ఎంపీపీ సీఎం భాష గారి ద్వారా కూడా సుమారు మూడు కోట్ల రూపాయలు వారి ఐదు సంవత్సరాల తెప్పించి ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు డాక్టర్ జయరాం మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధులకు అప్రమంతంగా ఉండాలని ఎవరికైనా జరాలు వస్తే భయపడవద్దని అవి వైరల్ ఫీవర్ మాత్రమే అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతి రాజ్ ఏఈ ప్రతాప్ , వెటర్నరీ డాక్టర్ భరద్వాజ్ , ఆర్ బ్ల్యూఎస్ ఓబయ్య, ఏవో చంద్రమోహన్, కరెంటు ఏఈ మహేష్, ఇరిగేషన్ ఏఈ సృజన, ఐ సి డి సి ఐ సిడిపిఓ లక్ష్మి, మండల సర్వేర్ సందీప్ రెడ్డి, ఎంపీడీవో ఆఫీస్ ఏవో రమణ, ఆర్ఐ సుధాకర్ రెడ్డి , రంగసముద్రం ఈఓ ప్రసాద్ రెడ్డి , ఎంపీటీసీలు రవి, ఎంఈఓ ఓబులేసు , పంచాయతీ సెక్రటరీలు మాబురెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు

## రంపచోడవరంలో నేడు జనసేన సమావేశం

రంపచోడవరం దేవీపట్నం జనసైనికులకు మండల అధ్యక్షుడి పిలుపు రంపచోడవరం కేంద్రంగా శనివారం, జూలై 4న జనసేన పార్టీ సమాచార సేకరణ కమిటీ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఎమ్మెల్సీ, అగ్ర నేత కొణిదెల నాగబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా దేవీపట్నం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చారపు వెంకటరాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీరామహిళలు అందరూ శనివారం ఉదయం 9 గంటలకు రంపచోడవరం ఆర్కా రెస్టారెంట్ వద్దకు చేరుకోవాలని కోరారు. సామాన్య కార్యకర్త నుంచి నాయకులుగా ఎదిగేందుకు మన అధినేత పవన్ కళ్యాణ్ గారు గొప్ప అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. సమావేశానికి వచ్చే వారు పార్టీ సభ్యత్వ ఐడి కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆధారాలను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి” అని వెంకటరాయుడు తెలిపారు. రేపు 04-07-2026 శనివారం ఉదయం 9 గంటలకు రంపచోడవరం ఆర్కా రెస్టారెంట్‌లో జనసేన సమాచార సేకరణ కమిటీ సమావేశం. దేవీపట్నం మండల జనసైనికులు, నాయకులు, వీరామహిళలు అందరూ హాజరుకావాలి.

## వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను

# అంగరంగ వైభవంగా నిర్వహిద్దాం.

వనపర్తి, పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వచ్చే ఏడాది మార్చి నెలలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు.శుక్రవారం వనపర్తి వెంకటేశ్వర స్వామి ఆలయంలో దాదాపు ఏడు కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ఈ బ్రహ్మోత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలుగా మాత్రమే కాకుండా, వనపర్తి పట్టణ ప్రతిష్టను చాటిచెప్పే 0మహోత్సవాలుగా నిలిచేలా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.భక్తి భావం, సేవా తత్పరత కలిగిన పెద్దలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఉద్యోగస్తులు, అధికారులు, అనధికారులు, యువత, మహిళలు సహా ప్రతి ఒక్కరూ ఈ మహోత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్య ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు హాజరయ్యే అవకాశముందని ఎమ్మెల్యే తెలిపారు.ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం రూ.6 కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు

వచ్చే మార్చిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మనకు ఇంకా సుమారు ఏడు నెలల సమయం ఉన్నందున ప్రతి నెలా ఒక సమీక్షా సమావేశం నిర్వహిస్తూ, కార్యక్రమాలను దశలవారీగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.బ్రహ్మోత్సవాల నిర్వహణకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, గతంలో ఎన్నడూ లేని విధంగా “నా భూతో న భవిష్యత్” అన్న స్థాయిలో ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు.భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామూహిక సేవా భావాలకు ప్రతీకగా నిలిచే ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## ఏదుల రిజర్వాయర్ ముంపు బాధితులకు

# రూ.2.34 కోట్ల చెక్కుల పంపిణీ.

### 47 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.

వనపర్తి. వనపర్తి నియోజకవర్గంలోని ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో ముంపుకు గురైన కొంకలపల్లి గ్రామానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల 34 లక్షలను మంజూరు చేసింది.ఈ మేరకు శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డినపర్తి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు సత్తి చేసిన కార్యక్రమంలో సంబంధిత లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏదుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి తమ పొలాలు, ఇండ్లు కోల్పోయి పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చిందని, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ గత పాలకులు తమ సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి ప్రతి కుటుంబానికి నష్టపరిహారం అందజేయడం ఆనందదాయకమని, తమకు న్యాయం జరుగుతోందనే నమ్మకం కలిగిందని లబ్ధిదారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.పొలాలు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ముంపు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, గోపాల్పేట ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు



సత్య శీలా రెడ్డి, రేవల్లి మండల అధ్యశులు సుల్తాన్ గ్రామ సర్పంచ్ బాలనాగయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు పర్వతాలు, లోడి రఘు, ఆర్డిఓ ఎంఆర్ఓ, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కోకస్ మన్నూర్ గ్రామంలో SmF ఎన్యూమరేషన్ ప్రక్రియను

## పరిశీలించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



నేడు ఇచ్చోడ మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SmF) ఎన్యూమరేషన్ ప్రక్రియను స్థానిక సర్పంచ్ షామిమ్ యూసఫ్‌తో కలిసి పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారుఅడిగిన వెంటనే బోర్ మంజూరు చేసిన ఆడే గజేందర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కోకస్ మన్నూర్ గ్రామస్తులుఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, ప్రజలు కూడా ఎన్యూమరేషన్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అవసరమైన వివరాలను అందించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షామిమ్ యూసఫ్,ఉప సర్పంచ్ విష్ణు,ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్యాం నారాయణ రెడ్డి, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ముస్తఫా,నియోజకవర్గ ఎస్సి సెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్,మాజీ ఎంపీటీసీ జాహిద్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పట్ల గోవర్ధన్,మండల మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, మాజీ నియోజకవర్గ అధికార ప్రతినిధి యండి సద్దాం,చోలే ప్రభాకర్,షేక్ ఫరూఖ్, మల్లేష్,పాముల మనోజ్,విశ్వనాథ్,రాజు తదితరులు ఉన్నారు

## తప్పిపోయిన బాలుడిని గంటలోనే గుర్తించి

## తల్లిదండ్రులకు అప్పగించిన 2-టౌన్ పోలీసులు




మహబూబ్ నగర్ మహబూబ్నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్, లో 9 వ తరగతి చదువుతున్న సాయి సుధీర్ (14), తండ్రి: అశోక్, నివాసం: అభంగపట్నం, కోయిల్కొండ మండలం, మహబూబ్నగర్, తేది 02-07-2026 ఉదయం స్కూల్ నుండి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. బాలుడి తల్లి మ్యాన్రే లావణ్య తన కుమారుడు కనిపించడం లేదని తేది 02-07-2026 రాత్రి 8:15 గంటలకు మహబూబ్నగర్ 2-టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.తల్లిదండ్రుల ఫిర్యాదు అందుకున్న వెంటనే 2-టౌన్ పోలీసులు అప్రమత్తమై, పోలీసులు సేకరించిన సీసీ కెమెరా ఫుటేజ్ ను క్షుణ్ణంగా పరిశీలించి బాలుడి కదలికలను గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా బాలుడి ఆచూకీ తెలుసుకున్న పోలీసులు, 2-టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్ర సత్యం చౌరస్తా వద్ద బాలుడు కూర్చుని ఉండగా గుర్తించి, సురక్షితంగా పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి బాలుడిని వారికి అప్పగించారు.

## పాఠశాల బస్సు డ్రైవర్ కోటి కు అభినందన వెల్లువ




నరసరావుపేట, పాఠశాల బస్సు డ్రైవర్ కోటి సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన సమయంలో డ్రైవర్ కోటి అసాధారణ సమయస్ఫూర్తిని ప్రదర్శించి, విద్యార్థులందరినీ వెంటనే సురక్షితంగా బస్సు నుంచి బయటకు తరలించారు. అనంతరం ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు మరియు నీటిని ఉపయోగించి మంటలను అదుపులోకి తీసుకువచ్చి ప్రశంసనీయమైన సేవలు అందించారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, ఎం వి ఐ కరుణాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆయనతో పాటు రవాణా శాఖకు చెందిన ఇతర సిబ్బంది కూడా సంఘటన స్థలంలో పాల్గొని అవసరమైన చర్యలు చేపట్టారు.డ్రైవర్ కోటి చూపిన చాకచక్యం, ధైర్య సాహసాలతో విద్యార్థులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఆయనను అభినందించారు.

## తల్లికి వందనం జాబితాను సిద్ధం గా ఉంచండి

### పిడుగురాళ్ల ఎంఈఓ ఎండి.ఖాసీం వెల్లడి



పిడుగురాళ్ల, :పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండి ఖాసీం పిడుగురాళ్లలోని జానపాడు రోడ్డులో గల మోడల్ ప్రాథమిక పాఠశాల మెయిన్, తుమ్మల చెరువులో గల మోడల్ ప్రాథమిక పాఠశాల డిడబ్ల్యును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయు లు మరియు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విద్యా సంవత్సరంలో తీసుకోవలసిన చర్యలను వివరించారు. పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పాఠశాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మరియు నాగేశ్వరావు లను అభినందించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంనాణ్యత విషయంలో రాజీ పడవద్దని, త్వరలో జరిగే మెగా పేటీఎంకు ఇప్పటినుండే సన్నాహాలు చేసుకోవాలని, తల్లికి వందనం జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.

## జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ పరిశీలకురాలు

## లోకం మాధవి కి దరఖాస్తు సమర్పించిన కొట్టే సాయి ప్రసాద్



శ్రీకాళహస్తి జనసేన పార్టీ నిర్మాణంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీకి తిరుపతి పార్లమెంట్ పరిశీలకురాలిగా శ్రీమతి లోకం మాధవి ని నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ మరియు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ శ్రీమతి లోకం మాధవి కి పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణకు సంబంధించిన దరఖాస్తు పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంటానని, పార్టీ నిర్మాణం మరియు బలోపేతం కోసం ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తానని తెలిపారు. పార్టీ మరింత బలపడేలా ప్రతి జన సైనికుడు, వీర మహిళ మరియు కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

# ప్రజా సేవల్లో నిర్లక్ష్యం వద్దు

### తిరుపతి కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి, తిరుపతి నగర ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

నగరంలో జరుగుతున్న పెండింగ్ అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డ్రైనేజీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని పేర్కొన్నారు. అలాగే, నగర ప్రజలకు ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026’ ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పగడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.?ముందుగా ఇన్చార్జ్ కమిషనర్ శారదా దేవి పనుల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డా. యువఅన్వేష్ తదితర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## 5 ఎకరాల వరకు రైతుభరోసా

# నిధులు విడుదల

రైతుభరోసా నిధుల విడుదల నాలుగో రోజూ కొనసాగింది. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న 4.41 లక్షల మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఇవాళ రూ.1,188 కోట్లు జమ చేసింది. దీనితో ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతులకు రూ.6,590.37 కోట్ల పెట్టుబడి సాయం అందింది. రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి.

# ఆర్ అండ్ ఆర్ కాలనీలకు ఇంటి పన్ను మినహాయింపు కల్పించాలి

**- పెండింగ్ పునరావాస సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**- మల్లన్నసాగర్ నిర్వాసితులు కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తాం - మంత్రి వివేక్ వెంకటస్వామి**

**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నివసిస్తున్న కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపకుండా పదేళ్లపాటు ఇంటి పన్ను మినహాయింపు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని పునరావాస సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ కారణంగా నిర్వాసితులైన గ్రామాల ప్రజలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ వంటేరు యాదవ్ రెడ్డి, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏటిగడ్డ కిష్టాపూర్ మాజీ సర్పంచ్ దామచర్ల ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గూడూరి రాములు, పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ మల్లేశం గౌడ్, చింతకింది కనకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీలను గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటికీ ఇప్పటికీ అనేక పునరావాస సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన కుటుంబాలకు పూర్తి స్థాయిలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు అందలేదని, ఒంటరి మహిళలకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీలు కూడా అమలు కాలేదన్నారు.ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన 57 మంది, వేములఘాట్‌కు చెందిన 39 మంది ఒంటరి మహిళలు హైకోర్టును ఆశ్రయించగా నాలుగు నెలల్లో ప్యాకేజీలు మంజూరు చేయాలని ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు కాలేదని తెలిపారు. అలాగే 2019 ఫిబ్రవరి 6 కట్‌ఆఫ్ తేదీ వరకు జీవించి అనంతరం మరణించిన అర్హుల కుటుంబాలకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు వర్తింపజేయాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని, తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, శ్మశానవాటిక వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిర్వాసిత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు పదేళ్లపాటు ఇంటి పన్ను మినహాయింపు, భవన నిర్మాణ అనుమతులు ఉచితంగా ఇవ్వాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన పునరావాస ప్యాకేజీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం అత్యంత సానుభూతితో పరిశీలిస్తోందన్నారు. ఇంటి పన్ను మినహాయింపు, భవన అనుమతుల రుసుము మాఫీ, పెండింగ్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు, ఒంటరి మహిళలకు ప్రత్యేక ప్యాకేజీలు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని



తెలిపారు.జిల్లా కలెక్టర్ కె. హైమావతితో స్వయంగా మాట్లాడి నిర్వాసితుల పెండింగ్ సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చూస్తామని, వినతిపత్రంలోని ప్రతి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం దిశగా కృషి చేస్తామని మంత్రి నిర్వాసితులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లన్నసాగర్ నిర్వాసితులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల పెద్దలు, బాధిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విమానాశ్రయం వద్ద వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి,(ప్రశ్న న్యూస్)** మూడు రోజుల పాటు తిరుపతి జిల్లాలో పర్యటించి, పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని, పర్యటనను అత్యంత విజయవంతంగా ముగించుకుని తిరుగుప్రయాణమైన మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈరోజు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద గౌరవపూర్వకంగా సాదర వీడ్కోలు పలకడం జరిగింది.ఈ సందర్భంగా మన కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి కి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, నియోజకవర్గ ప్రజలు తరఫున ధన్యవాదాలు తెలియజేశాను. చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మన శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కట్టుబడి ఉంటాం.

## యూరియా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**- డీలర్ అరెస్ట్.. మూడు లైసెన్సులు రద్దు.. మండల వ్యవసాయ అధికారి సస్పెన్షన్**

**- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరిక**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లాలో యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యూరియాను దుర్వినియోగం చేయడం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.ఇటీవల చేర్యాల మండలంలోని శ్రీ సాయి శివ ఫర్టిలైజర్ సేల్స్ దుకాణంలో యూరియా సరఫరాలో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన వెంటనే జిల్లా వ్యవసాయ అధికారితో విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో డీలర్ సందీప్ రెడ్డి ఈ-పాస్ యంత్రం ద్వారా హోల్‌సేల్ డీలర్ల నుంచి 6,429 యూరియా బస్తాలు తీసుకుని, వాటిని నిబంధనల ప్రకారం ధృవీకరించకుండా రైతుల ఆధార్ వివరాలతో అక్రమంగా విక్రయించినట్లు నమోదు చేసి యూరియాను దారి మళ్లించినట్లు తేలిందన్నారు. దీంతో అతనిపై పోలీసు కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు ఫర్టిలైజర్ లైసెన్సును రద్దు చేసినట్లు వెల్లడించారు.అలాగే సిద్దిపేట అర్బన్ మండలంలోని శ్రీ ఆంజనేయ ఫర్టిలైజర్స్, శ్రీ గణేష్ ట్రేడర్స్ హోల్‌సేల్ డీలర్ల నుంచి సరఫరా చేసిన యూరియా కూడా దుర్వినియోగమైనట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో, ఆ రెండు సంస్థల లైసెన్సులను వ్యవసాయ శాఖ డైరెక్టర్ రద్దు చేసినట్లు తెలిపారు.యూరియా అక్రమాలను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించిన చేర్యాల మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్ స్వామిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే యూరియా ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ పరిధిలోకి వస్తుందని, దాని అక్రమ సరఫరా, నిల్వ, దారి మళ్లింపు వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.గత రబీ సీజన్‌లో యూరియా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు ఎరువు సరఫరా చేసినట్లు తెలిపారు. పంట కాలం ముగియడంతో ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్ర ప్రభుత్వం యూరియా యాప్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సమయంలో, కేంద్ర ప్రభుత్వ ఈ-పాస్ వ్యవస్థను దుర్వినియోగం చేసి రైతుల పేర్లతో అక్రమ లావాదేవీలు జరిపినట్లు గుర్తించామని చెప్పారు.భవిష్యత్తులో యూరియా డైవర్షన్‌ను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి డీలర్ తప్పనిసరిగా యూరియా యాప్ ద్వారానే విక్రయాలు నిర్వహించాలని, ఇతర విధానాలను ఉపయోగిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు.

## విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

**- ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి**

**- బీసీ సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షులు : బత్తుల మహేందర్ యాదవ్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ పాఠశాలల్లోనే పుస్తకాలు, టైలు, బెల్టులు విక్రయించి తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వేములవాడ పట్టణ ఎంఈఓకు వినతిపత్రం సమర్పించారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్న ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## విలాసాగర్‌లో ఘనంగా పోచమ్మ తల్లి నూతన విగ్రహాల శోభాయాత్ర

**- అన్నదానంలో భక్తుల భాగస్వామ్యం**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. తొలి రోజు గోపూజ, గురువందనం, గణపతి పూజలు నిర్వహించిన అనంతరం త్రిలింగ సంగమేశ్వర దేవాలయం నుంచి నూతన విగ్రహాలను శోభాయాత్రగా పోచమ్మ ఆలయానికి తీసుకువెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మూడు రోజుల మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య కోరారు.

## విషాదంలో ఉన్న కుటుంబాలకు సకాలంలో భోజనం

**- బాధిత రెండు కుటుంబాలకు అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ ఉచిత అన్నదాన సేవలు**

**- అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు : తోట లహరి**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని 14వ వార్డు న్యూ అర్బన్ కాలనీలో దేరాజ్, 5వ వార్డు నాంపల్లికి చెందిన చిలువేరి చంద్రవ్వ మృతిచెందడంతో, వారి అంత్యక్రియల అనంతరం కుటుంబ సభ్యులకు అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం అందించారు. స్థానికులు గోడిశెల రేణుక, శేఖర్ సమాచారం ఇవ్వడంతో ఈ సేవను అందించినట్లు సంస్థ చైర్‌పర్సన్ తోట లహరి తెలిపారు.వేములవాడలో ఎవరైనా మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులు లేదా స్థానికులు 8919376459కు సమాచారం అందిస్తే, 15 మందికి సరిపడా భోజనాన్ని ఉచితంగా సకాలంలో పంపిణీ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

## గ్రామీణుల ఆరోగ్యానికి ఉచిత వైద్య శిబిరాలు దోహదపడుతాయి

**- స్తంభంపల్లి సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్**

**- స్తంభంపల్లిలో శ్రీ వర్ష కంటి దవాఖాన సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం శ్రీ వర్ష కంటి దవాఖాన, వేములవాడ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకు దగ్గర చూపు, దూరపు చూపు, తలనొప్పి, మెడ నొప్పులు, మోతిబిందు తదితర కంటి సంబంధిత సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు కూడా నిర్వహిస్తామని దవాఖాన వైద్య సిబ్బంది తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణుల ఆరోగ్యానికి దోహదపడుతాయని అన్నారు. శ్రీ వర్ష కంటి దవాఖాన సౌజన్యంతో గ్రామస్తులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని, శ్రీ వర్ష కంటి దవాఖాన వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, చింతలకోట రామస్వామి గౌడ్, తంగళ్ళపల్లి మహేష్, చంద్రగిరి మల్లయ్య, తునికి మల్లేశం, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ?

## ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా పండుగ రాజు ఏకగ్రీవ ఎన్నిక

**- ముదిరాజ్ సంఘం సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తా**

**- ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్షులు : పండుగ రాజు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ వీధి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పండుగ రాజు, ఉపాధ్యక్షుడిగా బాధరవేణి రాజయ్య, గౌరవ అధ్యక్షుడిగా మామిండ్ల రాములు, కోశాధికారిగా లాల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొలకాని, కర్ల సత్తయ్యలను ఎంపిక చేశారు.కమిటీ సభ్యులుగా గికూరు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ప్రేమ్ కుమార్, కొరవేణి హన్మాండ్లు, చిట్యాల అంజయ్య, లాల శ్రీనివాస్, స్వామి, రమేష్, దేవయ్య తదితరులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పండుగ రాజు మాట్లాడుతూ, ముదిరాజ్ సంఘ సభ్యులందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. సంఘ సంక్షేమాభివృద్ధి, యువతకు ప్రోత్సాహం, సభ్యుల సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని పనిచేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.సభ్యులు నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ, సంఘ పురోగతికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పర్యటన

**- విద్యుత్ సేవలపై అధికారులతో సీఎండీ సమీక్ష**





**సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లాలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం విస్తృతంగా పర్యటించి విద్యుత్ అభివృద్ధి పనులను పరిశీలించారు. వట్టెంల సబ్‌స్టేషన్‌లో అదనపు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, మర్రిపల్లి సబ్‌స్టేషన్‌లో బంచ్డ్ బ్రేకర్‌ను ప్రారంభించారు. వేములవాడ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో 13 కొత్త సబ్‌స్టేషన్లకు అనుమతులు మంజూరయ్యాయని, వాటిలో రెండు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. 19 బంచ్డ్ బ్రేకర్లలో 15 ఇప్పటికే పూర్తయ్యాయని, రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్య పెంపు, 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ల నిర్మాణంతో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సమస్యల కోసం 1912 కాల్ సెంటర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉద్యోగులకు ఆదేశించారు.

# పత్రికలో కథనాలు వచ్చిన చర్యలు ఉండవా.?

- అక్రమ నిర్మాణంపై డిప్యూటీ కమిషనర్ సీరియస్
- డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ రెడ్డికి ఫైర్ బ్రాండ్ జర్నలిస్ట్ తరపున ఫిర్యాదు
- సీజ్ చేసిన భవనాలలో నిర్మాణ పనులు జరుగుతే చర్యలు తీసుకోవాలి
- అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యకు ఫిర్యాదు కాపీ ఫార్వర్డ్.
- సీజ్ చేసిన నిర్మాణం ఎలా కొనసాగుతోందో పూర్తి నివేదిక ఇవ్వాలని స్పష్టమైన ఆదేశం
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేయించాలని ఆదేశించిన డిప్యూటీ కమిషనర్



**ముషీరాబాద్(ప్రశ్న న్యూస్)** ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో సీజ్ అక్రమ నిర్మాణాలలో నిర్మాణ పనులు కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలకు సంబంధించిన అంశంపై పత్రికలో వచ్చిన కథనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు ముషీరాబాద్ సర్కిల్--41 డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ రెడ్డి కి ఫైర్ బ్రాండ్ జర్నలిస్ట్ గ్రూప్ ఫిర్యాదు అందజేయగా, ఆయన వెంటనే స్పందించి టౌన్ ప్లానింగ్ ఎసిపి సెక్షన్ ఆఫీసర్ క్రిష్టయ్యకు ఫిర్యాదు కాపీని పంపిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యలకు ఫిర్యాదు కాపీని ఫార్వర్డ్ చేస్తూ, సీజ్ చేసిన నిర్మాణం మళ్లీ ఎలా కొనసాగుతోందనే అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించినట్లు సమాచారం.

అలాగే సీజ్ బోర్డు తొలగింపు, నిర్మాణ పనులు కొనసాగడం, మున్సిపల్ శాఖ నిబంధనల అమలులో చోటుచేసుకున్న బాధ్యతారాహిత్యం పై పూర్తిస్థాయి వివరాలు సేకరించి, వాస్తవాలను నిర్ధారించాలని సూచించినట్లు తెలిసింది. చట్టాన్ని ఎవరూ అతిక్రమించే అవకాశం లేకుండా, అక్రమ నిర్మాణాల విషయంలో నిబంధనల ప్రకారమే కఠినంగా వ్యవహరించాలని అధికారులకు డిప్యూటీ కమిషనర్ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.ముషీరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, ఏసీపి శ్రీనివాస్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశం ప్రస్తుతం ప్రజల్లో ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే ఈ అధికారుల కనుసైగల్లోనే భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిపై ఫిర్యాదులు అందిన చర్యలు తీసుకోకుండా సెటిల్మెంట్లు చేసుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా ఉన్నాయి. సీజ్ చేసిన నిర్మాణంలో పనులు కొనసాగుతున్న ఘటనపై అధికారుల విచారణ ఎలాంటి వాస్తవాలను వెలికితీస్తుందో, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. అయితే సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలలో సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు జోరుగా ఉన్నయి ఆయనపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని లేదా ప్రధాన కార్యాలయానికి ట్రాన్స్ఫర్ చేయాలని అధికారులు సైతం సూచించడం విస్మయాన్ని కలిగిస్తోంది.

# దళారులారా కబర్ధార్,బాధితుల పక్షాన భాజపా: ఎంకేఆర్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ హస్మత్ పెట్ సర్వే నెంబర్ 1 లో ఉన్న పురావస్తు శాఖ కు చెందిన భూమిని ఇటీవల హైడ్రా కూల్చివేతలు చేపట్టడంతో పాటు ప్రభుత్వం అధీనంలోకి తీసుకోవడంపై భాజపా నాయకులు స్పందించారు.హస్మత్ పేట్ లో హైడ్రా కూల్చివేతలు చేసిన ప్రాంతాన్ని భాజపా నాయకులు సందర్శించి పేద ప్రజలకు భరోసా కల్పించారు.కూకట్ పల్లి భాజపా ఇంచార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి తదితరులు బాధితులను కలిసి వారికి మనోధైర్యం కల్పించారు.కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అతని అనుచరులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అన్యాక్రాంతం చేశారని అన్నారు.పేద ప్రజలను లక్ష్యంగా చేసుకుని వారి నుండి డబ్బులు తీసుకుని క్రయవిక్రయాలు చేసిన దళారులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.పేద ప్రజలు నిర్మించుకున్న ఇళ్ల జోలికి వెళ్లవద్దని,ఖాళీ స్థలాలు కొనుగోలు చేసిన వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.ఇప్పటికే ప్రజలు హైడ్రా భయంతో బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారని తెలిపారు.పేద ప్రజల పేరుతో దళారులు చేసిన అకృత్యాలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని అన్నారు.భాజపా పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని,ఇప్పటికే బాధితులతో మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడి వారిలో ధైర్యం నింపారని చెప్పారు.

### ఛత్రీ స్థలాన్ని పరిశీలించినకూకట్ పల్లి ఇన్చార్జ్ మాధవరం కాంతారావు

నిన్న ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ సర్వే నెంబర్ 1 చిత్రీ బాధితులకు అండగా భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులు కూకట్ పల్లి ఇన్చార్జి మాధవరం కాంతారావు రావడం జరిగింది.సర్వే నెంబర్ వన్ ఛత్రిగడ్డకు వెళ్లి సందర్శించారు.గత 15 సంవత్సరాలుగా ఇక్కడున్న పాలకులు ప్రభుత్వ స్థలాలు చెరువులు,కుంటలు మొత్తం కబ్జా చేస్తూ అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించుకొని పేద ప్రజలను మోసం చేస్తూ వారి శ్రమన్ని కష్టార్జితాన్ని దోచుకొని వందల కోట్లు సంపాదించుకొని నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు.అలాగే 15 సంవత్సరాలలో కూకట్పల్లిలో ఉన్న తొమ్మిది చెరువులు కుంటలు సర్వేనెంబర్ వన్ లో ఉన్న 28 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది.స్థానిక ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ ఈ స్థలాన్ని పేద ప్రజలకు అమ్మి రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద ప్రజలను మోసం చేసి వందల కోట్లు దండుకొని వారి ఆవేదనకు వారి ఆక్రోసానికి కారణం అవుతున్నారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలించి పేద ప్రజలను వంచించి ఏ విధంగా రాజ్యమేలిందో ఇప్పుడున్న ప్రభుత్వం కూడా పేద ప్రజలను వంచిస్తుందని నిజంగా హైడ్రాకు ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ భూ బకాసురులను, దళారులను ప్రాసిక్యూట్ చేసి వారి ఆస్తులు జప్తి చేసి పేద ప్రజలకు న్యాయం చేయాలి పేదలు కట్టుకున్న ఇళ్లను ఇబ్బంది పెట్టకుండా ఎవరైతే ఖాళీ స్థలాలు లక్షలు పోసి కొన్నారో వారికి అమ్మిన దళారులను స్థానిక నాయకులను స్థానిక కార్పొరేటర్ ను స్థానిక ఎమ్మెల్యేను ఇందులో ప్రమేయం ఉన్నా స్థానిక కాంగ్రెస్ నాయకులను సైతం ప్రాసిక్యూట్ చేసి వారిని జైలుకు పంపాలి పేదలకు వారి డబ్బును తిరిగి ఇప్పించాలి,ఇక్కడ మోసపోయిన ప్రజలకు భారతీయ జనతా పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంది.

ఇక్కడి దళారులు స్థానిక కార్పొరేటర్ అనుచరులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.మా పేర్లు చెబితే చంపేస్తానని బెదిరించడం,నిజంగా ప్రభుత్వానికి హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే వీరిని వీరి దొంగల ముఠాను తప్పక శిక్షించాలి అని మాధవరం కాంతారావు డిమాండ్ చేశారు.గతంలో శాసన సభ్యులుగా పనిచేసిన వారు ఎవరు ఇలాంటి అక్రమ ఆర్జనకు పాల్పడలేదని పార్టీలకు అతీతంగా నిజాయితీగా పనిచేసే వారని మాదవరం కాంతారావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు,రవి కుమార్ గౌడ్ రమేష్,శేఖర్,హర్జీత్ సింగ్, కార్తీక్,కార్తీక్ కుమార్,రవి, మహేష్,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు సంస్కారం అలవర్చుకోవాలి

- బాలికల విద్యా సౌధాలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన హుమెన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా : అధ్యక్షురాలు షమీమ్
- వంటగదిలో లోపాలపై ఆందోళన, పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచనలు



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు మంచి సంస్కారం, క్రమశిక్షణను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని హుమెన్ రైట్స్ ఆర్గనైజేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు షమీమ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల విద్యా సౌధాలో శుక్రవారం ఆమె మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన షమీమ్.. సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి స్పష్టమైన లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా లేదా వేధింపులకు గురైనా వెంటనే తమ సంస్థను సంప్రదించాలని కోరారు. మహిళలు, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు హుమెన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.అనంతరం పాఠశాల వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన ఆమె పలు లోపాలను గుర్తించారు. మధ్యాహ్న భోజనంలో ఉపయోగిస్తున్న బియ్యం సరిగా ఉడకకపోవడం, కూరగాయల నాణ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా నిల్వ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలను నిర్లక్ష్యంగా నిల్వ చేయడం వల్ల ఎలుకలు, బొద్దింకలు, బల్లులు వంటి జీవుల కారణంగా ఆహారం కలుషితమై విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.విద్యార్థుల ఆరోగ్యం విషయంలో రాజీ పడొద్దని, వంటశాల, స్టోర్‌రూమ్‌లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హుమెన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షురాలు షమీమ్ ఉపాధ్యక్షురాలు రజియా బేగం జిల్లా కోఆర్డినేటర్ ఎండీ అజర్ ఉద్దీన్ సభ్యులుయాదమ్మ అర్బాస్ ఖాన్ ఖాజా ఖాన్ రసూల్ బాబా మసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## మంత్రి శ్రీధర్ బాబు అండదండలతో. శీను బాబు సహకారంతో. కష్టపడే వారికి కాంగ్రెస్‌లో సముచిత స్థానం.

- తొట్ల తిరుపతి యాదవ్ .





**మంథని ( ప్రశ్న న్యూస్)** రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సెంటినరీ కాలనీలో, ఐ. ఎన్. టి. యు. సి. శ్రీపాద భవనంలో ఆర్‌జీ-3 ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్లె రామ్మూర్తి, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి రొడ్డ బాపన్న సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తొట్ల తిరుపతి యాదవ్, ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కొత్త బాధ్యతలు దక్కించుకున్న నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబుల ఆశీస్సులతో పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారికి సముచిత గుర్తింపు లభించడం హర్షనీయమన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, కాంగ్రెస్ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని తొట్ల తిరుపతి యాదవ్ ఆకాంక్షించారు. కొత్త బాధ్యతలు చేపట్టిన నేతల అనుభవం పార్టీ అభివృద్ధికి, సంస్థాగత బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్, సెంట్రల్ కమిటీ మెంబర్లు, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రెటరీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుండ్ల పోచంపల్లి

# నూతన అధ్యక్షుడికి సన్మానం

- అందరిని కలుపుకొని పనిచేస్తా : గరిసెల సురేందర్ ముదిరాజ్



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన సురేందర్ ముదిరాజును కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. గుండ్ల పోచంపల్లి లోని ఓ ఫంక్షన్ హాలో జరిగిన ఈ కార్యక్రమంలో సురేందర్ ముదిరాజును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సురేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తలలో పలు విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అందర్నీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో సమస్యలను పరిష్కరించి నెంబర్ 1డివిజన్ గా తీర్చిదిద్దుతానని, రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పార్టీ జెండాను గుండ్ల పోచంపల్లి డివిజన్ కార్యాలయం పైన ఎగరవేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి, మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత ప్రాణం అమూల్యం.. ఆత్మహత్యలు వద్దు

- ఆర్వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో రైతు భద్రత అవగాహన ర్యాలీ




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ రైతుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని వక్తలు పిలుపునిచ్చారు. రైతు భద్రత, ఆత్మహత్యల నివారణ, పురుగుమందుల సురక్షిత వినియోగంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఆర్వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో గురువారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో వైద్య విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది చేతుల్లో "అన్నదాత ప్రాణం అమూల్యం -- ఆత్మహత్యలు వద్దు", "పురుగుమందులు జాగ్రత్తగా వాడండి", "ప్రతి ప్రాణం విలువైనదే" వంటి సందేశాలతో కూడిన ప్లేకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆర్వీఎం ఆస్పత్రి ప్రతినిధులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రైతులతో పాటు ప్రేమలో విఫలమైన వారు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారు క్షణికావేశంలో పురుగుమందులు, ఇతర విషపూరిత రసాయనాలు సేవించి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి సమస్య వచ్చినా ఆత్మహత్యే పరిష్కారం కాదని, కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు.పురుగుమందులు వంటి విషపూరిత రసాయనాలు సేవించిన వారిని ప్రాణాలతో కాపాడటం వైద్యులకు అత్యంత క్లిష్టమని వైద్యులు తెలిపారు. అందువల్ల రైతులు రసాయనాలను భద్రంగా నిల్వ చేయడంతో పాటు వాటి వినియోగంలో తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.దేశ సరిహద్దులను సైనికులు కాపాడితే దేశానికి అన్నం పెట్టే అన్నదాత రైతేనని, రైతు సంక్షేమమే రాష్ట్రం, దేశ అభివృద్ధికి పునాదని వక్తలు పేర్కొన్నారు. రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు."చిన్నచిన్న సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కావు... ప్రతి ప్రాణం అమూల్యమే" అనే సందేశంతో ర్యాలీ ముగిసింది.

## బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు : ఎస్ఐ అహ్మద్ అలీ



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న నాభి శిల (బొడ్రాయి) విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మరియు గ్రామదేవతల పండుగలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావుకు మర్కుక్ మండల బీజేపీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ అహ్మద్ అలీని నిర్వాహకులు మర్యాదపూర్వకంగా సత్కరించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని గ్రామస్థుల ఆధ్వర్యంలో నాభి శిల (బొడ్రాయి) ప్రతిష్ఠ మహోత్సవాలతో పాటు గ్రామదేవతల పండుగలను ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ఎంపీ రఘునందన్ రావు హాజరుకావడం గ్రామ ప్రజలకు ఆనందాన్ని కలిగించిందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# థ్రిల్లింగ్ కథాంశంతో 'నాగబంధం'

## ఉత్తరాది ప్రేక్షకులకు అదిరిపోయే ఆఫర్!




పాన్-ఇండియా స్థాయిలో వస్తున్న మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' జులై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ చిత్రంపై ప్రేక్షకులలో మంచి అంచనాలు ఉన్నాయి. అయితే, విడుదల రోజున ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్రబృందం ఒక వినూత్న ఆఫర్‌ను ప్రకటించింది. మొదటి రోజు 'ఒక టికెట్ కొంటే మరొకటి ఉచితం' (BOGO) ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇందులో ఒక కీలకమైన మెలిక ఉంది. ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ ఆఫర్ అందుబాటులో ఉండదని నిర్మాతలు స్పష్టం చేశారు. బాలీవుడ్ మార్కెట్‌లో తొలిరోజు భారీగా వసూళ్లు రాబట్టే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హిందీ మార్కెట్‌లో పోటీ ఎక్కువగా ఉండటంతో, ఇలాంటి ప్రమోషన్ ద్వారా ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ మంది ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. అభిషేక్ నామా దర్శకత్వంలో, నిక్ స్టూడియోస్ మరియు అభిషేక్ పిక్చర్స్ పతాకాలపై సుమారు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. పురాతన విష్ణు దేవాలయాలు, నాగబంధం రహస్యం, గుప్త నిధుల చుట్టూ తిరిగే ఈ కథలో భారీ వీఎఫ్ఎక్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.

జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉండటంతో, చిత్రం భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## పురాతన రహస్యాల ఛేదనలో..



నటుడు గణేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫిక్షనల్ మూవీ 'పినాక'. ధనంజయ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈచిత్రం అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఆదివారం హీరో గణేశ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేసి, శుభాకాంక్షలు అందించారు. పురాతన రహస్యాన్ని ఛేదించడంలో నిమగ్నమైన గణేశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పురాణాలు, రహస్యాలతో నిండిన అద్భుత ప్రయాణం ఈ సినిమా అని, అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కర్మ్ చావ్లా, సంగీతం: గౌర హరి.

# నా చిరునవ్వుల సింగారి



అశోక్ గల్లా, శ్రీగౌరీప్రియ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'విసా'-వింటారా సరదాగా'. ఉద్భవ్ రఘు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా నుంచి 'చింగారి' అనే పాటను విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ గీతాన్ని సనారే రచించారు. సిద్ శ్రీరామ్, లిప్సిక ఆలపించారు. 'చింగారి.. నా చిరునవ్వుల ఓ సింగారి.. బాగుందే నువ్వొచ్చాక' అంటూ మెలోడీ ప్రధానంగా ఈ పాట సాగింది. ప్రేమలోని మధుర భావాల్ని ఆవిష్కరిస్తూ చక్కటి సాహిత్యంతో ఈ గీతం ఆకట్టుకునేలా ఉంది. అమెరికాలోని తెలుగు విద్యార్థుల నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్ తదితరులు చిత్ర తారాగణం.

# 'లెనిన్' ట్రైలర్‌పై

## సినీ తారల ప్రశంసలు

### - అఖిల్‌పై మహేష్ బాబు స్పెషల్ పోస్ట్ వైరల్





అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని నటిస్తున్న తాజా చిత్రం లెనిన్ విడుదలకు సిద్ధమవుతోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. చాలా కాలంగా భారీ విజయం కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా కీలకంగా మారింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ చూసిన తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. లెనిన్ ట్రైలర్ చాలా ఎంజాయ్ చేశాను. అఖిల్ తన పాత్రలో హృదయాన్ని, ఆవేశాన్ని అద్భుతంగా చూపించాడు. ప్రతి ఫ్రేమ్‌లో అతని నటన ఆకట్టుకుంది. జూలై 10న విడుదల కానున్న ఈ సినిమాతో మొత్తం చిత్ర బృందానికి భారీ విజయం దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ ఆయన పోస్టు చేశారు. మహేష్ బాబు చేసిన ఈ పోస్టుకు స్పందించిన అఖిల్.. "అన్నా.. మీ పోస్టు మా ముఖాల్లో పెద్ద చిరునవ్వు తీసుకొచ్చింది. మీకు ఎంత థ్యాంక్స్ చెప్పినా తక్కువే" అంటూ కృతజ్ఞతలు తెలిపాడు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించారు. ట్రైలర్ అద్భుతంగా ఉంది. నా ప్రియమైన సోదరుడు అఖిల్ అదరగొట్టాడు అంటూ ఆయన అభినందించారు. అలాగే హీరో నాని కూడా ట్రైలర్‌పై స్పందిస్తూ, లెనిన్‌తో అఖిల్ పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. ట్రైలర్ చాలా బాగుంది. ప్రతి ఫ్రేమ్‌లో అతని కష్టపడిన తీరు కనిపిస్తోంది. ఈ సినిమా తప్పకుండా విజయాన్ని అందుకుంటుందనే నమ్మకం ఉంది అని పేర్కొన్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కుమారుడు ఎస్.ఎస్. కార్తికేయ కూడా ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించారు. లెనిన్ ట్రైలర్ బ్లాస్ట్ అయింది. అఖిల్.. ఇది నీ కెరీర్‌లోనే అత్యుత్తమ చిత్రంగా నిలిచేలా కనిపిస్తోంది. ఈ పాత్ర కోసమే నువ్వు పుట్టినట్టుంది. నీలో కనిపించిన ఫైర్, కమిట్‌మెంట్ అద్భుతంగా ఉన్నాయి. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. చిత్రబృందానికి శుభాకాంక్షలు అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ పోస్టులకు కూడా అఖిల్ స్పందిస్తూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. 'లెనిన్' రాయలసీమ నేపథ్యంలో సాగే యాక్షన్, ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. జూలై 10న విడుదల కానున్న ఈ సినిమాతో అఖిల్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బేబీ బంప్‌తో వర్కౌట్ చేస్తున్న

# సమంత

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తాజా ఫోటో డంప్‌లో వర్కౌట్ చేస్తున్న వీడియో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా వీడియోలో ఆమె లుక్‌పై నెట్టింట విస్తృతంగా చర్చ జరుగుతోంది.తాజా వీడియోలో సమంత జిమ్‌లో అప్పర్ బాడీ వ్యాయామాలు చేస్తూ కనిపించింది. ఫిట్‌నెస్‌కు ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే సమంత, కఠినమైన వ్యాయామాలను ఎంతో నిబద్ధతతో పూర్తి చేస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ప్రతి సెట్ అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ మళ్లీ వ్యాయామం కొనసాగించింది. అయితే, ఈ వీడియో నేపథ్యంలో సోషల్ మీడియాలో సమంత వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక ఊహాగానాలు కూడా వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉన్నారనే ప్రచారం కొద్ది రోజులుగా జరుగుతూ రాగా, దీనిపై సామ్ క్లారిటీ ఇచ్చింది. ఇటీవల మా ఇంటి బంగారం సక్సెస్ మీట్‌లో తాను ప్రెగ్నెంట్ చెప్పుకొచ్చింది. అయితే ఫిట్‌నెస్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, గర్భధారణ సమయంలో వ్యాయామం చేయాలనుకునే వారు తప్పనిసరిగా వైద్యుల సూచనలు, పర్యవేక్షణలోనే తగిన వ్యాయామాలు చేయాలి. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి భిన్నంగా ఉండటంతో, ఒకరికి అనుకూలమైన వ్యాయామం మరొకరికి సరిపోవాల్సిన అవసరం లేదు. మరోవైపు, సమంత తన కెరీర్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ కొత్త అడుగులు వేస్తూ విభిన్న కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫిట్‌నెస్ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.



## ఫీచర్ ఫిల్మ్‌గా వనజీవి రామయ్య



కోటి మొక్కల రామయ్యగా దేశవ్యాప్తంగా పేరుపొందిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య సేవలను స్మరిస్తూ రూపొందించిన లఘు చిత్రం 'వనజీవి రామయ్య'. వేముగంటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నిడిగొండ నరేశ్‌కుమార్ ప్రజాపతి నిర్మించారు. గద్దర్ అవార్డ్సులో ఈ సినిమా ఉత్తమ లఘుచిత్రంగా ఎంపికైన విషయం తెలిసిందే. బుధవారం వనజీవి రామయ్య జయంతిని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవకులను ఘనంగా సత్కరించారు.

# హృద్యమైన కాగితం పడవలు



వర్దన్, కృష్ణప్రియ జంటగా నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారం దర్శకుడు. కీర్తన నరేశ్, టీఆర్ ప్రసాద్‌రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మాతలు. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 24న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సినిమా విడుదల కానున్నది. అందర్నీ అలరించే హృద్యమైన ప్రేమకథాచిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రుద్రసాయి, సంగీతం: ఏఐఎస్ నౌఫల్ రాజా, నిర్మాణం: ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణది క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్.



# మూడింతల పారితోషికం

హిందీ చిత్రసీమలో ప్రతిభావంతురాలైన కథానాయికగా గుర్తింపును తెచ్చుకుంది శ్రద్ధాకపూర్. ప్రస్తుతం ఆమె ప్రసిద్ధ మరాఠీ నృత్యకారిణి, తమాషా కళాకారిణి విఠాబాయి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న 'ఈథ' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా ఆగస్ట్ 28న విడుదలకానుంది. ఇదిలావుండగా ఈ సినిమాకు శ్రద్ధాకపూర్ దాదాపు 15కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నదని తెలిసింది.వీశీజఱవం రెండేళ్ల క్రితం చేసిన 'స్త్రీ-2' చిత్రం కోసం ఆమె కేవలం ఐదుకోట్ల పారితోషికాన్ని మాత్రమే తీసుకుందట. అయితే 'ఈథ' సినిమాలో పాత్రపరమైన సవాళ్లతో పాటు దాదాపు ఏడాది పాటు డేట్స్ కేటాయించాల్సి రావడంతో నిర్మాతలు ఆమెకు 15 కోట్ల భారీ మొత్తాన్ని అందించారని చెబుతున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధితో బాధిత కుటుంబాలకు ఊరట: ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

- పెడనలో 44 మంది లబ్ధిదారులకు రూ.35.87 లక్షల ఆర్థిక సాయం, ఎల్ఓసీల పంపిణీ



పెడన(ప్రశ్న న్యూస్)ఆర్థిక ఇబ్బందులు, వైద్య ఖర్చులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులు, అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను పెడన ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. పెడన తోటమూలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు చెక్కులు, ఎల్ఓసీలను అందజేశారు. పెడన, బంటుమిల్లి, కృతివెన్ను, గూడూరు మండలాలకు చెందిన 44 మంది లబ్ధిదారులకు సుమారు రూ.35,87,600 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, వైద్య సహాయ పత్రాలు అందజేయడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, పేదల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీల ద్వారా సకాలంలో సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సాయం అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, క్లిష్ట సమయంలో అందిన ఈ సహాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని భావోద్వేగం వ్యక్తం చేశారు.

## వైసీపీ పాలనలో వ్యవస్థలు దెబ్బతిన్నాయి

### - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

- టీ.కొత్తపాలెంలో రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ



నాగాయలంక(ప్రశ్న న్యూస్) వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయని, ప్రస్తుతం చట్టబద్ధమైన, పారదర్శకమైన పరిపాలనను నెలకొల్పడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే అన్నారు. నాగాయలంక మండలం టీ.కొత్తపాలెంలో నిర్వహించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని 1,457 మంది రైతులకు పాస్ పుస్తకాల పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దోచుకో--దాచుకో విధానం కొనసాగిందని, జగనన్న కాలనీల పేరుతో ఇసుక, మట్టి, ఇనుము, సిమెంట్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు కృషి చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో చట్టబద్ధమైన పరిపాలన విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, గ్రామీణ రహదారుల అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. 22ఏ జాబితా నుంచి భూములను తొలగించి ఇప్పటికే 9,498 పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన అర్హుల దరఖాస్తులను కూడా పరిశీలించి పాస్ పుస్తకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

## రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

- పేద, మధ్యతరగతి వర్గాల ఆర్థిక, హార్థిక అభ్యున్నతికి రోటరీ క్లబ్ విశేష కృషి చేస్తోంది.
- రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం



చిలకలూరిపేట (ప్రశ్న న్యూస్ )సేవాభావంతో చేపట్టే కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయని, పేద..మధ్యతరగతి వర్గాల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్న రోటరీ క్లబ్ కార్యవర్గం సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. శుక్రవారం ఆయన పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో జరిగిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల్ని అభినందించిన అనంతరం పలువురు విద్యార్థులకు స్కాలర్షిప్ లు అందజేశారు. అనంతరం ఆయన సభను ఉద్దేశించి మాట్లాడారు. పేదలకు ఆర్థిక, హార్థికంగా అండగా నిలవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన నుంచి పుట్టిన పీ-4దిశగా రోటరీ క్లబ్ అందిస్తున్న సేవల్ని అందరూ గుర్తించాలన్నారు. సేవాగుణంతో పాటు ప్రజలకు అండగా నిలవాలన్న మంచి మనసున్నవారినే రోటరీ క్లబ్ సభ్యులుగా అధ్యక్షులు బోడి రామ సుబ్బారావు, కార్యదర్శి మానం శ్రీనివాసరావు ని మిగతా సభ్యులను ఎన్నుకున్నారని, వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యుల పదవీ కాలాన్ని ఏడాది నుంచి రెండేళ్లకు పెంచాలని, అప్పుడే కార్యవర్గసభ్యులకు నిజమైన సేవాసంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అసిస్ట్ సేవా సంస్థ అధ్యక్షులు జస్టి రంగారావు, నాటక రంగ ప్రముఖులు ముత్తినేని సురేష్ బాబు , కందిమల్ల సాంబశివరావు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సభ్యులు ఉప్పుటూరి ప్రసాద్, చిలుకూరి శ్రీనివాసరావు, అడుసుమిల్లి మోహనరావు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వకుళామాత సన్నిధిలో ఘనంగా 'అక్షర గోవిందం అన్నప్రాశనం' ప్రారంభం

- చిన్నారుల విద్యారంభానికి టీటీడీ వినూత్న కార్యక్రమం
- ఉచితంగా 'అక్షర గోవిందం కిట్' పంపిణీ



**తిరుపతి(ప్రశ్న న్యూస్)** చిన్నారుల విద్యారంభం, జీవితారంభం శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్య అనుగ్రహంతో మంగళప్రదంగా సాగాలనే లక్ష్యంతో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన "అక్షర గోవిందం -- అన్నప్రాశనం" కార్యక్రమం శుక్రవారం తిరుపతిలోని శ్రీ వకుళామాత ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం. రవిచంద్ర ప్రారంభించి చిన్నారులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ, అక్షరాభ్యాసం, అన్నప్రాశనం ప్రతి చిన్నారి జీవితంలో అత్యంత పవిత్రమైన సంస్కారాలని పేర్కొన్నారు. తొలి అక్షరం "గోవింద" నామంతో ప్రారంభమైతే విద్యాభ్యాసం దైవానుగ్రహంతో విజయవంతంగా సాగుతుందనే విశ్వాసంతో టీటీడీ ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి హిందూ కుటుంబం ఈ దివ్య అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలకు శుభారంభాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. ఉచితంగా 'అక్షర గోవిందం కిట్' పంపిణీప్రత్యేక పూజల అనంతరం చిన్నారులకు టీటీడీ ఉచితంగా 'అక్షర గోవిందం కిట్' అందజేసింది. ఈ కిట్‌లో రాతపలక, బలపాలు, అక్షింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి కంకణం, ఫటిక బెల్లం, శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ వకుళామాత, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ సరస్వతీదేవి చిత్రపటాలు, గోవింద నామాలు, శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, పెద్దబాలశిక్షతో పాటు పూజా, విద్యా సామగ్రిని ఏర్పాటు చేశారు. రూ.2 కోట్లతో నూతన వసతి సముదాయం ప్రారంభంఅనంతరం రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన యాత్రికుల వసతి సముదాయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం. రవిచంద్ర సంయుక్తంగా ప్రారంభించారు. ఈ వసతి సముదాయం ద్వారా తిరుపతికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భాను ప్రకాష్ రెడ్డి, దర్శన్, ఎన్. సదాశివరావు, డాలర్ దివాకర్ రెడ్డి, హెచ్‌డీపీపీ కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, అదనపు కార్యదర్శి కల్యాణి, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, భక్తులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. ఈ నూతన కార్యక్రమం ద్వారా చిన్నారుల విద్యారంభాన్ని ఆధ్యాత్మికతతో మేళవిస్తూ హిందూ సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే దిశగా టీటీడీ మరో ముందడుగు వేసిందని భక్తులు అభిప్రాయపడ్డారు.

## పేద విద్యార్థి ఉన్నత విద్యకు చేయూత

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

- భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యా ఫీజులకు ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్)** పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే (వాసు) మరోసారి తన సేవాభావాన్ని చాటిచెప్పారు. తమ ఆధ్వర్యంలో నడుస్తున్న భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలోని 41వ డివిజన్‌కు చెందిన ఓ నిరుపేద విద్యార్థికి విద్యా ఫీజుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ఉన్నత విద్య కొనసాగించేందుకు అవసరమైన ఫీజులను ట్రస్ట్ తరఫున అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, "పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు. చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి విద్యార్థికి భవాని చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడితో సమానం. విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసి సమాజానికి సేవ చేయాలి" అని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు దాతల సహకారం కూడా పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వర్రే శ్రీనివాసరావు, కొల్లి బుజ్జి, చాపల చిన్నరాజు, సలాది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్‌కు గుడ్‌బై.. జూట్ సంచులకు వెల్‌కమ్

- అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా పటమటలో ప్రజలకు జూట్ సంచుల పంపిణీ



విజయవాడ(ప్రశ్న న్యూస్) ప్లాస్టిక్ సంచుల వినియోగానికి స్వస్తి పలికి, పర్యావరణ హితమైన జూట్, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ కె. షమ్మీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం పటమట ప్రాంతంలో ప్రజలకు జూట్ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ సంచులు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, జీవావరణాన్ని కలుషితం చేయడంతో పాటు ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రజలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని పూర్తిగా మానుకుని, జూట్, గుడ్డ వంటి పునర్వినియోగ సంచులను ఉపయోగించాలని సూచించారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విజయవాడ నగరపాలక సంస్థ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. వ్యాపారులు, దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్ సంచుల విక్రయాన్ని నిలిపివేసి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని కోరారు. ప్రజలు కూడా మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ఇంటి నుంచే సంచులు తీసుకెళ్లడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగనోట్ల ముఠాపై ఇబ్రహీంపట్నం పోలీసుల మరో దెబ్బ

- మరో ఇద్దరు నిందితుల అరెస్ట్.. రూ.50 వేల విలువైన నకిలీ నోట్లు, ప్రింటింగ్ పరికరాల స్వాధీనం
- దొంగనోట్ల కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్ట్.
- రూ.50 వేల విలువైన నకిలీ రూ.500 నోట్లు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్, స్కానర్, లామినేటర్ స్వాధీనం.
- పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు కొనసాగుతోంది.



విజయవాడ(ప్రశ్న న్యూస్)దొంగనోట్ల చలామణి కేసులో ఇబ్రహీంపట్నం పోలీసులు మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.50 వేల విలువైన నకిలీ రూ.500 నోట్లు, నకిలీ కరెన్సీ తయారీకి ఉపయోగిస్తున్న అత్యాధునిక పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ వెస్ట్ జోన్ డీసీపీ గుణ్ణం రామకృష్ణ ఆదేశాలు, వెస్ట్ డివిజన్ ఏసీపీ ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు పర్యవేక్షణలో ఇబ్రహీంపట్నం సీఐ ఎ. సుబ్రహ్మణ్యం నేతృత్వంలో ప్రత్యేక బృందం ఈ ఆపరేషన్ నిర్వహించింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన ప్రధాన నిందితుడి నుంచి లభించిన సమాచారంతో పోలీసులు అనంతపురం వెళ్లి పుల్లాలరేవు రాజా (36), పొదిలి భాస్కర్ (46)లను జేఎన్‌టీయూ రోడ్డు, నేతాజీ నగర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 100 నకిలీ రూ.500 నోట్లు (రూ.50,000), రెండు కానన్ ప్రింటర్లు, డెల్ ల్యాప్‌టాప్, ఎప్సన్ స్కానర్, లామినేటర్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ గుణ్ణం రామకృష్ణ మాట్లాడుతూ, కేసు నమోదైన మరుసటి రోజే ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేయడం అభినందనీయమని, కేసును వేగంగా ఛేదించిన ఇబ్రహీంపట్నం సీఐ, దర్యాప్తు బృందాన్ని అభినందించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు రాజు (ఎ 3) కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు పుల్లాలరేవు రాజాపై గతంలో కూడా నకిలీ కరెన్సీ, మాదకద్రవ్యాల కేసులతో పాటు ఇతర నేర కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

## దోమల నివారణపై ప్రజలకు అవగాహన



నాచారం (ప్రశ్న న్యూస్) మల్లాపూర్ డివిజన్ లో ఓల్డ్ విలేజిలో దోమలపై మున్సిపల్ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షాకాలం సీజన్లో దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. వర్షాకాల సీజన్లో ఇంట్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి ఫ్రైడే ఫ్రైడే పాటించాలని సూచించడం జరిగింది. ఇండ్లల్లో ఉండే టైర్లు కుండలు కొబ్బరి బోండాలు ఎప్పటికప్పుడు చెత్త బండ్లకు వేయాలని చెప్పారు. పరిశుభ్రతతోనే రోగాలు దూరం అవుతాయని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఎండమాలజీ సూపర్వైజర్ పరమేష్, సతీష్, ఎంటమాలజీ సిబ్బంది, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## 4,500 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ టెండర్లు

- మంత్రి నిమ్మల రామానాయుడు
- వేదాద్రి కంచల ఎత్తిపోతలకు పునర్జీవం
- 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి లక్ష్యం


**జగ్గయ్యపేట(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించిన మంత్రి, రూ.15 కోట్ల వ్యయంతో చేపడుతున్న వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతులు, పది సంవత్సరాల నిర్వహణ కోసం రూ.4,500 కోట్లతో భారీ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఐడీసీ ఎండీ తిరుమలరావు, కేడీసీ చీఫ్ ఇంజనీర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ శాఖలో ఆగం ఆగం

## టౌన్ ప్లానింగ్‌లో పాలన అస్తవ్యస్తం

- ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్ల కొరతతో కుప్పకూలుతున్న వ్యవస్థ
- ఫిర్యాదులకు స్పందన శూన్యం, సెటిల్‌మెంట్లకే ప్రాధాన్యతనా.?
- ఒక్క అధికారి మూడు సర్కిళ్లు, ప్రజలకు నరకయాతన
- సీఎం వద్దే శాఖ ఉన్నా అధికారుల్లో కనిపించని భయం




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ శాఖ, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం తీవ్ర పరిపాలనా సంక్షోభంలో కూరుకుపోయిందనే విమర్శలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. కీలకమైన ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్ల పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉండగా ఇన్‌చార్జ్ అధికారులతోనే వ్యవస్థను నడిపించడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఒకే అధికారికి రెండు, మూడు సర్కిళ్ల బాధ్యతలు అప్పగించి సీసీపీలు, కమిషనర్లు చేతులు దులుపుకుంటున్నారని దాని వల్ల ఎక్కడా సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా అక్రమ నిర్మాణాలు, అనుమతుల ఉల్లంఘనలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి కీలక అంశాలు పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి నెలకొన్నట్లు ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదులు గుట్టలు.. చర్యలు మాత్రం శూన్యం

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మూడు కమిషనర్ల పరిధిలోటౌన్ ప్లానింగ్ కార్యాలయాల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించడం లేదని బాధితులు వాపోతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం, నోటీసులు జారీ చేసినా తదుపరి చర్యలు తీసుకోవడం లేదని కేవలం పర్సనల్ వ్యవహారాలు, సెటిల్‌మెంట్లకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ శాఖ నియమ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు సమస్యలు పరిష్కరించడంపై కాకుండా అందినకాడికి దండుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారా.? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### ఇంటి అనుమతులు, ఓసీల్లో తీవ్ర జాప్యం

ఇంటి నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసి లు), తనిఖీలు, పర్యవేక్షణ వంటి అనేక అంశాలు కూడా అధికారుల కొరతతో తీవ్రంగా రోజురోజుకు తీవ్రమవుతున్నాయని సమాచారం. దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ ఎక్కడ.?

కిందిస్థాయి అధికారుల, సిబ్బంది పనితీరుపై జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారా.? లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జోనల్ కమిషనర్ల నిర్లక్ష్యంతోనే కిందిస్థాయి అధికారులు సిబ్బంది బాధ్యతారాహిత్యం తో విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజల ఫిర్యాదులను బుట్ట దాఖలు చేసి కార్యాలయాల చుట్టూ తింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్న జోనల్ కమిషనర్లు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్ కార్యాలయాల్లో క్రమశిక్షణ, బాధ్యత, జవాబుదారీతనం ఎక్కడ కనిపించకపోవడం వల్ల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో నెలకొన్న ఈ అయోమయం కేవలం అధికారుల, సిబ్బంది కొరతతోనే పరిమితం కాకుండా ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపం, పరిపాలనా నిర్లక్ష్యం, నిర్ణయాల ఆలస్యం వంటి అంశాల సమ్మేళనంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### సీఎం వద్దే శాఖ... అయిన ఎందుకీ నిర్లక్ష్యం.?

మున్సిపల్ శాఖ నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారుల్లో కనీస బాధ్యతాభావం కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారానికి గడువు విధించడం, అవినీతి ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించడం వంటి చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.
ప్రజల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ప్రజలకే భారంగా మారితే ప్రభుత్వ పరిపాలనపై ప్రజలకు నమ్మకం దెబ్బతింటుంది. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ శాఖలోని టౌన్ ప్లానింగ్ వ్యవస్థను గాడిలో పెట్టి, జవాబుదారీతనం కలిగిన పాలన అందిస్తుందా.? లేక ఫిర్యాదుల గుట్టల మధ్య ప్రజలను మరింత నిరాశలోకి నెట్టేస్తుందా.? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే ఉంది.

# రహదారులపై రాత్రి టిఫిన్ దందా

- మామూళ్ల మాయాజాలమా.? - మెట్టుగూడ నుంచి ఉప్పల్ వరకు రోడ్లపై ఆక్రమణలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం,మామూళ్ల ఆరోపణలు - ఎస్‌బీ అధికారుల తనిఖీలు ఎక్కడ.?
- ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు వెళ్లడం లేదు.? - ప్రజల ప్రాణాల కంటే అక్రమ వ్యాపారాలకే ప్రాధాన్యతనా.?




**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో మెట్టుగూడ నుంచి ఉప్పల్ వరకు ప్రధాన రహదారులపై ఆటోలలో ప్రతి రోజు రాత్రి టిఫిన్ సెంటర్ల పేరుతో జరుగుతున్న వ్యాపారాలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారులపై ఆటోలను నిలిపి వాటినే టిఫిన్ సెంటర్లుగా మార్చడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతుండగా ఈ పరిస్థితి సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ ఉన్నత అధికారులు కఠిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.రాత్రి వేళల్లో వందలాది మంది ఈ టిఫిన్ సెంటర్ల వద్దకు చేరుకోవడంతో రోడ్లపై వాహనాలు నిలిచిపోవడం, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడటం, ప్రమాదాల అవకాశాలు పెరగడం సాధారణంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా రహదారులను వ్యాపార కేంద్రాలుగా మార్చడం చట్టవిరుద్ధమని తెలిసినా అధికారుల కనుసైగల్లో ఈ దందా నిరాటంకంగా సాగుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, ఒక్కో ఆటో లేదా టిఫిన్ బండి నుంచి ప్రతిరోజు లేదా ప్రతి నెలా భారీగా మామూళ్లు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. అయితే ఈ ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా రోడ్లపై ఆటోలలో టిఫిన్ సెంటర్లు నిర్వహించడమే సాక్ష్యం అని ప్రజలు మండిపడుతున్నారు. అయినప్పటికీ, ఇలాంటి ఆరోపణలపై ఉన్నత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలనే డిమాండ్ వాహనదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ముఖ్యంగా పోలీసు శాఖలో అంతర్గత నిఘా బాధ్యతలు నిర్వహించే ఎస్‌బీ అధికారులు ఇలాంటి అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారా.? రోడ్లపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, కిందిస్థాయి సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై నివేదికలు పంపుతున్నారా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంవత్సరాలుగా ఒకే ప్రాంతాల్లో ఒకే తరహా వ్యాపారాలు కొనసాగుతున్నప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీస్ స్టేషన్లు, జీహెచ్ఎంసీ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఈ సమస్యను వెంటనే పరిష్కరించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అలాంటి కఠిన చర్యలు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.ప్రజా రహదారులు ప్రజల కోసం ఉండాలి గానీ, అక్రమ వ్యాపారాలకు వేదికగా మారకూడదని వాహనదారులు పేర్కొంటున్నారు. రాత్రివేళల్లో అత్యవసర సేవల వాహనాలు కూడా ఈ రద్దీ కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు.మెట్టుగూడ నుంచి ఉప్పల్ వరకు ప్రధాన రహదారులపై జరుగుతున్న ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు, ట్రాఫిక్ విభాగం, సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వతంగా తొలగించాలని కోరుతున్నారు. మామూళ్ల ఆరోపణల్లో నిజానిజాలు ఏమిటో తేల్చాలనీ ఉన్నత అధికారులను కోరుతున్నారు. అక్రమ ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగించి, ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, చట్టపాలనను కాపాడడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని వాహనాదారులు గుర్తు చేస్తున్నారు.




# పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

- ప్రమాదంలో కనీసం 40 మంది మృతి, 8 మందికి గాయాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల సరిహద్దులోని షెరనీ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ ప్రయాణికుల బస్సు, దానా సర్ ప్రాంతంలోని పర్వత రహదారిపై ప్రయాణిస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, బ్రేకులు విఫలం కావడం వల్లే ఈ ఘోరం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా లోయలోకి దూసుకెళ్లింది.ప్రారంభంలో ఈ బస్సు 36 మంది ప్రయాణికులతో బయలుదేరినప్పటికీ, మార్గమధ్యంలో మొరాయించిన మరో వాహనంలోని ప్రయాణికులను కూడా ఎక్కించుకోవడంతో మొత్తం ప్రయాణికుల సంఖ్య 48కి చేరింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే '1122' అత్యవసర సిబ్బంది, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని జోబ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదంపై బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించగా, పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్‌పై కేంద్రం సీరియస్

- వివరణ కోరేందుకు మెటాకు సమన్లు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సోషల్ మీడియా దిగ్గజం మెటాకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రేరేపించేలా ఉన్న ప్రకటనలు, సైబర్ మోసాల ముప్పుపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తీవ్రంగా స్పందించారు. ఈ అంశంపై వివరణ కోరుతూ మెటాకు నోటీసులు జారీ చేయాలని ఐటీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఒకే వారంలో మెటా సంస్థకు కేంద్రం నోటీసులు ఇవ్వడం ఇది రెండోసారి అవుతుంది. వాట్సాప్‌లోని 'యూజర్ నేమ్' ఫీచర్‌కు సంబంధించి కేంద్రం ఇప్పటికే బుధవారం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో వస్తున్న కొన్ని పెయిడ్ ప్రకటనలు, వినియోగదారులను టెలిగ్రామ్ వంటి ఇతర ప్లాట్‌ఫామ్‌ల ద్వారా చైల్డ్ అబ్యూజ్ కంటెంట్ నెట్‌వర్క్‌ల వైపు మళ్లిస్తున్నట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ వ్యవహారాన్ని కేంద్ర మంత్రి తీవ్రంగా పరిగణించారు. చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించే విధంగా ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల విషయంలో మెటా నుంచి వివరణ కోరాలను అధికారులకు ఆదేశాలు అందాయి. ఇటీవలి కాలంలో మెటా కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం నిశితంగా దృష్టి సారించడం ఇది రెండోసారి. కొద్ది రోజుల క్రితమే వాట్సాప్ ప్రతిపాదించిన 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కూడా కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, గుర్తింపు చౌర్యం పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ మెటాకు ప్రభుత్వం ఇప్పటికే నోటీసులు పంపింది.

## మహిళా సంక్షేమం, సాధికారతకు

# కేంద్రం పెద్దపీట



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధికారతకు మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని మహిళా ప్రాంగణంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కేంద్రం పాటుపడుతోందని, ఉజ్వల పథకంలో భాగంగా 11 కోట్ల గ్యాస్ కనెక్షన్లు మహిళలకు ఇచ్చామని చెప్పారు. త్వరలో మహిళలకు35 శాతం రిజర్వేషన్లు తీసుకు వస్తామన్నారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా మహిళలకు విడుతల వారీగా ఆటోలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. గూడ్స్ ఆటోలు మన కరీంనగర్ లో మాత్రమే నడుస్తున్నాయని, వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయన్నారు. అన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు మంచి చేయాలని చూస్తుందని, అయితే గత పాలకులు మాత్రం ఇందుకు భిన్నంగా పని చేశారని, గత పాలకులకు మహిళలను ప్రోత్సహించాలన్న సోయి లేకుండా పోయిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు కొని ఇవ్వడమే కాకుండా పదో తరగతి చదివిన విద్యార్థులకు పరీక్ష ఫీజులు కట్టిన విషయాన్ని బండి సంజయ్ కుమార్ గుర్తు చేశారు. మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం : డాక్టర్ కవ్వంపల్లిఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేలా మహిళలను తీర్చిదద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని చెప్పారు. మహిళా సంఘాలకు రూ.10లక్షల రుణంతో పాటు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. మహిళల్లో కష్టపడే తత్వం మెండుగా ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలతో వారు సత్ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు,కార్యక్రమాలన్నీ మహిళా ప్రాంగణం ద్వారా ప్రవేశపెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.మహిళలను బలోపేతం చేసేలా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందిస్తున్న సహాయం, చేస్తున్న కృషి ఎంతో గొప్పదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588